కథానిక

రా(క్ష)సలీల!

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

నడ్డిమీద తంతే నాలుగు పళ్ళూ రాలాయట! అలా జరిగింది ఇదంతా:

విజయనగర సామ్రాజ్యాన్ని విలాధీశుడు పాలిస్తున్న వేళ-

ఆయనగారి రాజ్యంలో-

దేశం సుభిక్షంగా ఉండాలనీ, ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలనీ, ఎక్కడా కల తలూ, కన్నీళ్ళూ, దోపిడీలూ, దుర్మార్గాలూ, వ్యభిచారాలూ, వంచనలూ ఉండకూడదనీ-

అలా అనుకుంటూ, అంటూ

కనీసం ప్రజల్ని అలా అనుకునేలా చేస్తూ

ఆయనగారు సుఖంగా, నిరాటంకంగా, అడ్డూ అపూ లేకుండా రాజ్యమేలుతున్న వేళ-

ఎక్కడికక్కడ ఆయన పరగణాన్ని రక్షక భటాధీశుకు అంటగట్టిన వేళ-

ఒక పరగణాలో

ఒక రక్షక భటాధీశుని ఆధీనంలో

ప్రజలు

రహదారుల్లో గుర్రాలమీదా, కంచర గాడి దల మీదా, ఏనుగుల మీదా పోతూ అడుగడు గునా గజ గజలాడుతున్న వేళ-

ఎందుకంటారా?

గుర్రానికి నాడా లేకపోతే జరిమానా, గాడిదకు చెవి లేకపోతే జరిమానా ఏనుగుకి కన్ను లేకపోతే జరిమానా విధిస్తుండబట్టే!

రహదారి మీద వాళ్ళు గీచిన గీతలను ఇటు నుంచి పోతే జరిమానా అటు నుంచి పోతే జరిమాన విధిస్తుండ బట్టే!!

అదేమని అడిగితే మరింత జరిమానా కాబట్టే!!!

ఈ రకంగా ఆ రక్షక భటాధీశుని పరగణాలో రక్షక భటులు రంజు రంజుగా విందు విందుగా కసాయి నృత్యం సాగిస్తున్న ఒక మునిమాపు వేళ...

వేగులవాడు

ఓ వేగులవాడు ఏతెంచాడండీ!

ఎక్కడికంటారా?

సూరమ్మ కంపెనీ వద్దకు!

ఎవరా సూరమ్మ, ఏమా కథ అని అడుగు తున్నారా?

సూరమ్మ అమ్మాయిలకు అధిపతి సార్! ఆమె అమ్మాయిలను పోగుచేస్తుంది. అమ్మాయిలను మళ్ళవేస్తుంది. అమ్మాయి లను మేపుతుంది. అమ్మాయిలను తారు స్తుంది. అమ్మాయిల ఎంగిలి తింటుంది. అమ్మాయిల కడుపులు కొడుతుంది. అమ్మా యిల ఆశలతో ఆడుకుంటుంది. అమ్మా యిల జీవితాలను నాశనం చేస్తుంది.

సూరమ్మ అంటే ఆమె!!

ఆ పరగణాకి పై రక్షక భటాదీశుల వారు విచ్చేశాక ఆమె తన బిజినెస్‌ని బంద్ చేయాల్సి వచ్చింది. అంటే ఇప్పుడామె భవనంలో ఆడవాళ్ళు లేరని కాదు, ఉన్నారు, కాకపోతే మీరు వెళ్ళే సరికి అంతా తలా ఒక కుట్టుమిషను ముందు కూర్చుని కనిపిస్తారు. కొందరు అల్లికలు అల్లుతుంటారు. మరి కొందరు బొమ్మలకు రంగులు వేస్తుంటారు. అలా ఒక కుటీర పరిశ్రమలా కనిపిస్తుందా కొంప, పగటి మాట ఇది. రాత్రి అయేసరికి మాత్రం మామూలే. ఎక్కడి కక్కడ అంతా గప్‌చుప్. అమ్మాయిలు రసికుల కౌగిళ్ళలో సూరమ్మ డబ్బులు లెక్క పెట్టుకుంటూ...

ఆమె ఈ చాకచక్యం సంగతి కింది వర్గపు రక్షక భటులకు తెలుసు గాని వాళ్ళ రాజు గారికి మాత్రం తెలీదు. ఎక్కడెక్కడ అంతా సజావుగానే ఉందనుకుంటాడాయన.

అలా ఆమె సంగతి తెలిసి ఉన్న కింది వర్గపు రక్షక భటులలో ఒకానొక వేగుగారు ఓ రోజు మధ్యాహ్నం కొద్దిగా నిషాని తలకెక్కించుకుని, వొంటిని కొంత వేడెక్కించుకుని, ఆ వేడిని తీర్చుకోవటం కోసం సూరమ్మ కొంపకు చేరుకున్నాడు. చేరుకుని-

సూరమ్మతో తనకర్జెంటుగా ఒక అమ్మాయి కావాలన్నాడు.

సూరమ్మకు గొడవలు పెట్టుకోవటం ఇష్టముండదు. గొడవల్లో ఇరుక్కోవటం ఇష్టముండదు. అందుకని ఆమె తెలివిగా అతణ్ణి రాత్రిదాకా ఆగమన్నది. అతగాడు ఆగలే నన్నాడు. నిజంగానే ఆగలేక, వేగలేక ఆమె 'పోనీ నేను కావాలా?' అంది నవ్వుతూ. 'నువ్వెవరికి కావాలి డొక్కువి,' అన్నాడతను కళ్ళనిండా కక్కుని నింపుకుని, ముసలి ముసలిగా బరువు బరువుగా వదులు వదులుగా ఉంటుందామె శరీరం. ఆమె అతనితో ఆ మాటను పరాచికానికే అన్నా అతను దాన్ని పరాచికం కింద తీసుకోక పోవటమూ, కళ్ళ నిండా అసయ్యాన్ని నింపుకోవటమూ చూసే సరికి ఆమెలోని స్త్రీత్వపు అహం దెబ్బతింది. ఆమెకు అరికాళ్ళ మంట కాళ్ళ మధ్యకు పాకింది. హుంకరించి ఆమె అన్నది కదా:

"కాదకా నీకు దిక్కున్న చోట చెప్పుకో, పిల్లను మాత్రం నీ దగ్గరకు పంపను..."

ఆమె వానిటీ అంతగాగాయపడ్డది. పడదా మరి!?

అతగాడి పోలీసు వానిటీ కూడా దెబ్బ తిన్నది. తినదంటారా పాపం?!

"సరే చూస్తాన్!" అన్నాడతను కోపంగా.

"చూస్కో నీ మొహం!" అందామె నిర్లక్ష్యంగా.

చిరుచిరుగా బుర్రు బుర్రుగా హ్రీ బ్రీగా అతనచ్చోట నుంచి నిష్క్రమించాడు.

టకటకా చప్పుడుతో టింగుటాంగుగా కింగుకాంగులా రక్షక భటాధీశులం వారు తన పరిపాలనా గదిలోకి వేంచేశారు.

పారా హుషార్!!!

ఎక్కడివాళ్ళక్కడ అటెన్షన్ - పరమ టెన్షన్!!

చేతిలో కర్రతో ఆయన అలా నడుచు కుంటూ తన బల్ల వద్దకు వచ్చాడు. కుర్చీలో కూర్చోబోతూ గదినంతా ఒకసారి పరికిం చాడు. అవతలగా నేలమీద అగ్గిపుల్ల కనిపించింది. వెళ్ళి దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. అది చూడగానే రక్షకభటుడు "శుభ్రంగా ఊడిపించా దొరా, ఇదెలా వచ్చిందోగాని," అన్నాడు వణికిపోతూ. ఆయన ఒకసారి అతని కళ్ళలోకి కఠినంగా చూసి అగ్గిపుల్లను అతని చేతికిచ్చాడు.

మళ్ళీ వెళ్ళి ఆయన తన ఆసనం మీద కూర్చోబోతూ ఎడమచేతి చూపుడు వేలుతో బల్లమీద అలవోకగా రాచి ఆ వేలిని కంటి ముందు ఉంచుకుని చూశాడు. దుమ్ము ఏమీ అంటకపోయేసరికి సంతృప్తిగా తలాడించాడు.

శుభ్రతకి ఆయన చాలా ప్రాధాన్యత నిస్తాడు. ఒక్క తన పాలనా గది, బల్లా మాత్రమే కాదు, సమాజమంతా కూడా అత్యంత శుభ్రంగావుండాలంటాడు. మనుషు లంతా మచ్చలేకుండా ఉండాలంటాడు. మనుషులలో సహజంగా విచ్చలవిడి ప్రవృత్తి ఉంటుందనీ, దండభయం లేకుంటే దానిని అదుపులో పెట్టడం దుస్సాధ్యమనీ భావిస్తాడు. అందుకనుగుణంగానే ఆచరణలో పెట్ట జూస్తాడు. అందుకోసం తన అనుచరుల కళ్ళాల్ని పూర్తిగా వదులుచేసి ఉంచుతాడు. ఆ కారణం వల్లే వాళ్ళు ఆయన ఎదురుగా ఎంత పిల్లుల్లా ఉంటారో సమాజంలోకి వెళ్ళేసరికి అంత పులుల్లా ప్రవర్తిస్తారు. ఆయన ఆ పరగణాని తన చేతికిందికి తీసుకున్నాక అక్కడ రౌడీల ఆగడాలు తగ్గిపోయాయి. గూండాల స్వైర విహారం తగ్గిపోయింది. వ్యభిచారం మామూలల్లోకిపోయిదాక్కుంది. అందుకు ఆయనకెంతో సంతృప్తి కలుగు తూంది. అయితే ఆయనఅనుచరవర్గం ఆయన ఇచ్చే స్వేచ్ఛను బయట దుర్వినియోగపర్చడం కూడా జరుగుతోంది. ఫలితంగా ఒకోసారి అమాయకులు, మామూలు జనం కూడా ఇబ్బందులనెదుర్కొంటున్నారు. అలాంటి సంఘటనే ఇప్పుడూ జరిగింది:

ఆయన తల వంచుకుని తన ఇలాకా తాలూకు నేరాలపట్టిక చూస్తుండగా, ఇందాక చెప్పిన వేగులవాడువచ్చి దణ్ణం పెట్టి నమ్రతగా నిలబడ్డాడు. ఏమిటంటూ తలపైకెత్తాడాయన. 'ఫలానా ఏరియాలో ఫలానా ఆడమనిషి స్త్రీ శరీర వ్యాపారాన్ని టోకుగా చేసేస్తోంది దొరా' అన్నాడతను. 'ఏమిటీ నిజమే?' అన్నాడాయన సీరియస్సుడైపోయి. 'అయ, నిజమే దొరా,' అన్నాడతను భయస్థుడైపోయి. ఆయనకు ఇతని మీద అపారమైన నమ్మకం ఉంది. ఆ నమ్మకం సంగతి ఇతనికీ తెలుసు.తెలిసే అలా అన్నాడు. అతని అంచనా కరక్టే అయింది. వెంటనే ఆయన ఫలానాఏరియా సామంతాధి కారికి దూరశ్రవణ యంత్రాన్ని తిప్పాడు...

భళాభళీ రక్షకభట సామంతు!

శ్రవణ యంత్రాన్ని ఎత్తి మళ్లీ కింద పెడుతూనే సామంతాధికారి అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. ఏయ్ నాలుగు వందల్ల మూడూ అన్నాడు. ఏయ్ మూడు వందల నాలుగూ అన్నాడు. వరేయ్ రెండువందల వందా అన్నాడు. ఆ ముండకెంత ధైర్యం అన్నాడు. ఇంకా యవ్వారపు కొంప నడుపు తోందా అనరిచాడు. ముండల్ని బొక్కల్లో తోసెయ్యండి అని హుంకారం వేశాడు. పై రక్షకభటాధీశుడువచ్చాక ఇతని మామూళ్ళన్నీ ఆగిపోయాయి. ఆ ఫ్రస్ట్రేషన్‌ని తట్టుకోలేక సమయం వచ్చినప్పుడల్లా ఇతను ఆ కోపాన్ని మామూలు జనంమీద ప్రదర్శిస్తుంటాడు.

ఇప్పుడూ అదే జరిగింది. పటపటా చప్పట్లు చేశారతని అనుచరులు. యుద్ధరంగంలోకి దూకుతున్న వీరుల్లా బయటకి పరుగెత్తారు.



పాపం ఇన్నోసెంటిల్!

ఆమె పేరు లీల. పాతికేళ్ళపైన ఉంటాయి. పెళ్ళయింది. ముగ్గురు పిల్లలు కూడా. భర్తతో హాయిగా కాపురం చేసుకుం టోంది. అలాంటి ఆమె మళ్ళీ గర్భం ధరించ డంతో వైద్యుని వద్ద పరీక్షింప చేయించుకో టానికి ఆరోజు మధ్యాహ్నం ఆమె నగరానికి బయల్దేరింది. ఆమె ఎక్కిన వాహనం కొంతదూరం వచ్చాక ట్రబులివ్వడంతో చోదకుడు దానిని సరిచేసుకుని మళ్ళీ బయ ల్దేరదీసి నగరానికి చేరుకునే సరికి రాత్రి ఎనిమిదయ్యింది.ఆమెకు నగరంలో ఒకరిద్దరు బంధువులున్నారు. వాళ్ళలో తనకు బాగా దగ్గరైన ఒక బంధువు ఇంటికి వెళ్ళిందామె.

అప్పటికి రాత్రి తొమ్మిదయింది.

ఆ బంధువు ఎవరో కాదు, సూరమ్మ!

(సూరమ్మ ఆడ వ్యాపారం చేస్తుంటుం దన్న సంగతి పాపం ఆమెకు తెలియదు)

లీల వెళ్ళేసరికి వీధి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. గుమ్మం లోంచి లోపల అడుగుపెట్టేసరికి లోపల అంతా కంగాళీ కంగాళీగా వుంది. ఇనపబూట్ల చప్పుళ్ళతో కాకీ బట్టలు కదులుతున్నాయి. అక్కడున్న ఆడవాళ్ళు భయం భయంగా చూస్తున్నారు. సూరమ్మ ఏదో వాదన పెట్టుకుంటోంది. అలాంటి సమయంలో ఒక ఖాకీవాడు లీలను చూశాడు.

చూసీ చూడగానే అతని కళ్ళు మెరిసాయి. మెరిసీ మెరవగానే అతను అరిచాడు.

"ఇదుగోరొరేయ్, ఇక్కడొకతె దాక్కుంది!"

"చూస్తావేరా మరి, తోసేయ్ ముండని వ్యానులోకి!"

ఏమి జరుగుతుందీ అర్థం కాలేదు లీలకు. అర్థమయే సరికి ఆమె వెళ్లి వానులో ఉన్నది...

ఏకంగా శిరోముండనం!

దర్జాగా ఆసనం మీద కూర్చుని ఉన్నాడు రక్షక భట సామంత ప్రభువు. అవతలగా గోడపక్క ఎనిమిది మంది ఆడవాళ్ళు నిలబడి ఉన్నారు. మరో పక్క రక్షక భటులు నిలబడి ఆ ఆడవాళ్ల వేపు ఆబగా చూస్తున్నారు. ఆకలి మీద ఉన్న కుక్క నాలిక చాచి చొంగ కారుస్తూ రొప్పుతూ చూస్తుంటుంది చూసారా, అలా ఉంది వాళ్ళ వాలకం. దూకమా వద్దా అన్నట్టు సామంత ప్రభువు అనుజ్ఞ కోసం చూస్తున్నారు వాళ్ళు. అతని పనీ అట్లాగే ఉంది గాని కఠినుడైన రక్షక భటాధీశుని మొహం గుర్తుకు వచ్చి ఆగి పోతున్నాడు. అతనికి ఆ ఆడవాళ్ళ మీద చాలా కోపంగా ఉంది. వాళ్ళ మూలంగా తను నానా తిట్లూ తిన్నాడు. వాళ్ళను ఏం చేస్తే బాగుంటుందది?"

"వీళ్ళను ఏం చేద్దామంటావు రాందాసూ?" గురగురా అన్నాడు ఒక అను చరుడి వేపు చూసి.

"మీరు ఊఁ అనండి దొరా, మేము చూసుకుంటాము వాళ్ళ సంగతి!"

"అమ్మమ్మ తప్పురారేయ్! ఈ మధ్య అలాంటి పని ఏది చేసినా పత్రికలలోనెక్కి పోతున్నాయి."

"అవును బావూ కాళ్ళూ చేతులూ కట్టేసినట్లుంటోంది!"

కొద్ది సేపు ఆలోచించాడు సామంత ప్రభువు. అతని బుర్రలో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది.

"ఒరేయ్ రాందాసూ నీకు బుర్ర గొరగటం వచ్చురా?" అన్నాడు.

"ఎందుకు రాద్దొరా?"

"అయితే మంచిది, వెళ్ళ ఓ క్షురమరిక పట్టుకొస్తావా?"

రాందాసు బయటకి వెళ్ళుతుండగాగోపాల మనే మరో రక్షక భటుడన్నాడు.

"బుర్ర గొరగటం నాక్కూడా వచ్చు దొరా!"

"అయితే మరీ మంచిది, రెండు చురికలు పట్టారా రాందాసూ!"

రెండు చురికలూ వచ్చాయి. కత్తెరలు కూడా వచ్చాయి.

ఆడవాళ్లు కీచుకీచుమంటుంటే రక్షక భటులు హోహ్హోహ్హోమంటూ పరమ సంతోషంగా తమ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముందు ఇద్దరు ఆడవాళ్ళను పట్టి నేల మీద పడవేశారు.

"మీకు కావాలంటే నన్ను వాడుకోండి గాని జుట్టు మాత్రం గొరగవద్దు రక్షక భట బాబూ!" అంది ఒకామె ఒకడి కాళ్ళు పట్టుకుంటూ.

గొల్లుమని నవ్వాడు వాడు.

"మాకు పర్మిషన్ లేదు గాని ఉంటే నువ్వు చెప్పే దాకా ఆగుతామంటే పిచ్చి ముండా? నకరాలు వేయకుండా తల వొంచు..."

ఆ ఆడవాళ్ళ ఆస్తే ఆ వొళ్ళూ, ఆ పళ్ళూ, ఆ కళ్ళూ, ఆ జుత్తూను. అది కాస్తా పోతే ఇంక వాళ్ళను చూసేదెవరు?! ఆ ఆడామె తన శక్తినంతా కూడదీసుకుని మొరా యించాలని చూసింది. అప్పుడు ఆ రక్షక భటులు ఏం చేసారో తెలుసాండీ?!

ఒక రక్షక భటుడు ముందు నుంచి ఆమె రెండు బుజాలూ గట్టిగా నొక్కి పట్టు కున్నాడు. మరొకడు పక్కన నిలబడి జుత్తు పట్టుకుని కత్తెరను పరపరలాడించాడు.

పెళ్ళు పెళ్ళున నవ్వారు భటులంతా. (వాళ్ళు పెళ్ళు పెళ్ళున కాకపోతే కిలా కిలా కల కలా నవ్వుతారటండీ మీ భ్రమ కాక పోతే!?)

చిన్న పిల్లలు తూనీగల్ని పట్టిచాటి రెక్కల్ని తోకల్నీ పీకుతూ తుంచుతూ ఆనందిస్తారు చూసారూ అలా ఉంది ఆ సమయాన వాళ్ళ ధోరణి!

ఆ రకంగా ఓ రెండున్నరామూడుగంటల సేపు పరిపాలనా కార్యాలయంతో రక్షక భటు లు ఆ ఆడవాళ్ళ తలల్ని గొరుగుతూ విపరీతానందాన్ని అనుభవించారు.

అలా తలలు గొరగబడ్డ ఆడవాళ్ళలో అనుకోకుండా అమాయకంగా వచ్చిపడ్డ లీల కూడా ఉంది పాపం...

ఆఖర్న శిరోవేదనం!

మర్నాటికి ఈ వార్త దావానలంలా పాకి పోయింది. పత్రికల వాళ్ళు వచ్చారు. ఈ ఆడవాళ్ళ బొమ్మల్ని తీసుకున్నారు. రసవత్తర మైన రీతిలో తమ పత్రికల్ని నింపారు. ఇదే సమయమని ప్రతిపక్షాల వాళ్ళు కలుగజేసు కున్నారు. నానా కంగాళీ చేశారు (వాళ్ళకు కావాల్సింది ఇలాంటి గొడవలే కదా?!) ఎన్నడూ ఎక్కడా కనిపించని రకరకాల ప్రజా సంఘాల వాళ్ళూ అకస్మాత్తుగా పుట్టుకు వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వం ఆ ఆడవాళ్ళకు డబ్బులివ్వటానికి ప్రయత్నిస్తే ఈ సంఘాల వారు, వాళ్ళు ఆ డబ్బు తీసుకోకుండా అడ్డుపడ్డారు. వీటన్నిటితో సామ్రాజ్యాధీశుని గద్దె కొద్దికొద్దిగా కంపించ సాగింది. దానితో ఆయనగారు లేచి నిల బడ్డాడు.

ఆ రకంగా కొన్నాళ్ళపాటు ఆ సంఘటన పై స్థానాలలో వున్న కొందరి శిరోవేదనలకు కారణభూతమయ్యింది.

తర్వాత?

రక్షక భటాధీశుడు వేరే చోటికి బదిలీ వేయబడ్డాడు. సామంతుడు సస్పెండ్ వేయ బడ్డాడు. భటులూ సస్పెండ్ వేయబడ్డారు.

ఆ తర్వాత??

ఆ తర్వాత ఏమీ కాలేదు, కొలనులోకి రాయి విసిరినప్పుడు కొద్దిగా అలలు కదిలి తర్వాత ప్రశాంతత చోటు చేసుకుంటుంది చూశారూ అలా కొందరి వెంట్రుకలు కొంతసేపు కదిలి తర్వాత సర్దుకు కూర్చు న్నాయి. కొన్నాళ్ళకి అందరి శిరోవేదనలూ తగ్గిపోయాయి. ఇపుడు సామంతుడు మళ్ళీ ఉద్యోగంలో కుదురుకున్నాడు. భటులూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈమొత్తానికీ మూల కారకుడయిన వేగుల వానికి పై ఉద్యోగానికి ప్రమోషన్ లభించింది. మరి ఆ ఆడవాళ్ళు?

ఆ ఆడవాళ్ళు?

ఆ ఆడవాళ్ళు ఎక్కడ ఉన్నారో, ఏమ య్యారో, వాళ్ళకేమన్నా అపకారం జరిగిందో లేదో ఎవరికీ తెలియదు. ఎవరూ పట్టించు కోలేదు.

లీల మొగుడు మాత్రం పెళ్ళాం గుండు చూడగానే రక్షక భటులు గుర్తుకు వచ్చి, వాళ్ళ రాసలీలలు గుర్తుకువచ్చి, తన ప్రతిష్ఠ గుర్తుకువచ్చి ఆమెను కాస్తా ఇంట్లోంచి తన్ని తరిమేశాడు!

ఇప్పుడు రాజ్యమెలా ఉందంటారా?

వాహనయోగం కల ప్రజలు రహదారుల మీద జరిమానాలుకట్టే కట్టే ఇక కట్టటానికి డబ్బులు లేక తమ తమ గుర్రాల్నీ, గాడిదల్నీ ప్రభుత్వానికిచ్చేసి ఇపుడు కుక్కల మీదా, పిల్లుల మీదా, ఎలుకల మీద తిరగడం మొద లెట్టారు.

కాళ్ళే ఆస్తిగా కలవాళ్ళు రహదారి మీద నడిస్తే ఏమి ప్రమాదం జరుగుతుందో ఏమి జరిమానా కట్టాల్సి వస్తుందోనని భయంతో కొందరు సందుల్లోంచి, కొందరు గొందు ల్లోంచీ, ఇంకొందరు ఇళ్ళ కప్పుల మీంచి నడవటం అలవాటు చేసుకున్నారు.

కాస్త తెలివి తేటలు కలవాళ్ళు అటూ ఇటూ తప్పుగా నడిస్తే జరిమానా గాని పాకినా, దేకినా జరిమానా విధించే చట్టమేమీ లేదు కదా అని రహదారుల మీద పాకటమూ దేకటమూ ప్రారంభించారు!

ఇప్పుడు సామ్రాజ్యాధీశుల వారి దివా ణంలో ఆయనగారి అధికారులంతా ఆయన గారిని మెప్పించటం కోసం కుక్కలమీద, పిల్లుల మీద, ఎలుకల మీద స్వారీ చేస్తున్న జనం మీద పన్నులు జరిమానాలు విధించట మెలాగా, రహదారునిండా పాకుతూ దేకుతూ పోతున్న ప్రజలను ఏ రకంగా నిరోధించాల అన్న విషయం మీద జుట్టు పీక్కుంటూ బుర్రలు బద్దలు చేసుకుంటున్నారట!

వారి విలువైన బుర్రలకు ఎంత చక్కటి ఆలోచనలు వస్తాయోనని ఆ రాజ్యంలోని ప్రజలందరూ వేచి చూస్తున్నారు!